# సన్మాన ప్రయత్నం

“ఇంతగా నువ్వుచెబుతున్నావు గనక-ఈ సారికి ఓ శేరు ఉప్పు దాఖల్ చేసుకుంటానేం?” అన్నాను.

“చెడ్డొచ్చి మొదలా డన్నట్టూ?” అని గోపాలం నవ్వడం మొదలు పెట్టాడు. గోపాలం నవ్వుతూంటే—నాకు గుండెల్లో దేవుతుంది. హంతకుల్ని పట్టుకుని పత్తేదారు అరిందమబాబు నవ్వుతాడే—నవలల్లో—అల్లా నవ్వుతాడు గోపాలం.

“గోపాలం! నువ్వు నవ్వకు. యీ సారికి యిల్లాపోనీ—నేనూ ఏదో రోజులు వెళ్ళదీస్తున్నాను.”

“పోనీ వోటి చెయ్—” అన్నాడు గోపాలం.

“అల్లా చెప్పూ-వినకపోతే వొట్టెట్టు! మరి నువ్వుగూడా నా కష్టసుఖాలు గమనించొద్దూ?” అన్నాను. మాటలేమో దీనంగానూ, గొంతుకేమో ధిక్కరిస్తూనూ.

“వో విధంగా చేస్తే—”అన్నాడు గోపాలం నానుస్తూ.

“నువు చెప్పింది నే కాదన్నానుటయ్యా-నాన్చకా-” అన్నానునేను.

“తేలికలో పోతుంది— జమిలిదుప్పట్లు నువ్విచ్చేసెయ్....” అన్నాడు.

“దుప్పట్లే?” నాకు తిక్కరేగింది. అసలు నాది పెంకెబుర్ర. కాస్త పైత్య వికారంగా వుంటోందిప్పుడు.

“వుప్పే నేనెందుకు యివ్వకూడదు?”

“సెక్రటరీగారు యిచ్చేశారు”

"ఈ సెక్రటరీ వోడు, ప్రతిదానికీ పుష్పా కచ్చికలూ చందా వేయడానికి!"

"పోనీ చిరిచాప యిచ్చుకుంటాను!"

"అది నా సమర్పణలోనిది. పైగా కొనేశాం."

"ఏదో యింత కారం!"

"సుందరం పద్దువేసి డబ్బులిచ్చాడు."

"అన్నీ తేలిక తేలికవి మీరున్నూ. అటకాయించేవి మరో రున్నూ?" అన్నాను. గోపాలం మళ్ళీ నవ్వుతున్నాడు. వాడు నవ్వాడో నాకు గుండెల్లో దేవినట్లుంటుంది.

'గోపాలం! ఈ సన్మానం అసలు ఎందుకటా చేస్తోంది!' అన్నాను. మళ్ళీ విందామని విసుగెత్తి వీడు చక్కాపోతాడేమో అనీని.

"మన రాధయ్యలేడూ, ఆయనా ఆయనభార్యా దయతలిస్తే-మనం కోరుకున్నట్లు ఎండా వానా?"

"అరె!"

"నమ్మాలి. నమ్మి చెడినవారు లేరు. రోహిణీకార్తె, రోళ్లుబద్ద లయ్యే ఎండల్లోనైనాసరే—రాధయ్యభార్య కిష్టమ్మత్త-వొడియాలకంటూ పప్పు నానోశిందో-చూసుకో వాన కావురు కప్పుకొచ్చి క్షోణీపాతం కురిసిందే!"

"ఛ"

"మురికివానలు కురుస్తూ, పొయ్యిగూడా రాజెయ్యడం ఎల్లాగను కొనే రోజుల్లో-రాధయ్య దుప్పట్లు కొన్నాడో కళకళలాడుతూ సూర్యోదయం చెంద్ర నిప్పులు చెరగటం!"

"బాగానేవుంది కథ!" అన్నాను.

"వాళ్లు మరీ నిరుత్సాహపడి-చితికిపోయారు"

"పాపం!"

"మనం కాస్త హుషారిచ్చి వాళ్ళకు ఓ చిన్న సన్మానం చేస్తిమా, వాళ్లూ పచ్చపచ్చగా వుంటారు. మనమూ—"

"ఇది గ్రామ కట్నం అంటున్నావు!" అన్నాను.

"అలాంటిదే!" అన్నాడు గోపాలం.

"వోపని చేయించు. చూసుకో నీ సన్మానం ఫెళ ఫెళ లాడుతుంది!"

"సన్మానం నాక్కాదండీ, రాధయ్యకు"

"సరేలేవయ్యా మహ నేర్చావు పదసందులు తీయడం. మన రైతులు అలగా జనం లేరూ—వాళ్ళకు పురెక్కించు!"

"బాగానే వుంది"

"గూడు కట్టకుండా నారోసు కోడానికీ— వానరాకుండా కళ్ళం జేసి నూర్చుకోడానికీ అని పురెక్కించావూ— పెళ్ళల్లే చేయొచ్చు సన్మానం!"

"మీరు చెప్పింది బాగానేవుంది గాని, పాపం వాళ్ళకు చెప్పినా తెలీదు. తెలిసినా చెయ్యలేరు."

"కందకు లేని దురద బచ్చలి కెందుకూ—నా మాటవిని—ఏం"

"మహాత్మా! నలుగురికీ సేవచేద్దామని ఓట్లకు మనం ఖర్చు పెట్టటం లేదుటండి. కాస్త మీ పద్దు—దుప్పట్లు వేద్దురూ. వాగించక— అన్నాడు గోపాలం. మా బావమరిది తాలూకాబోర్డు వోట్లలో వోడిపోయింది దెప్పుతాడా వీడు హన్న. ఇంకా చిలక మాదిరి గునుస్తాడూ? రమ్మన్నా, తిమ్మన్న బంతికి"

"నా వల్ల కాదండీ—చూశారూ" అన్నాను మర్యాదగా.

"పీనాసి అని ఎందుకనిపించు కుంటావ్. ఎల్లాగో ప్రతిదీ చెయ్యనూ చేస్తావు, ముందు ఖాంయ్ మంటూ కరవా కరుస్తావు"

"ఏం చెయ్యను? మీ బోటి వాళ్ళు పలుపులు తెంచుకొని వచ్చి మీదపడి, ఊపిరాణ్ణీరాయె" అన్నాను. మిగులుస్తానా?

గోపాలం నవ్వుతున్నాడు. గోపాలం నవ్వినప్పుడల్లా నాకు **గుం**డెల్లో దేవినట్లుంది.

"ఏమైనా సరే—నేనివ్వను."

"నువ్వే యిస్తావు! యీ ప్రగ్గెలెందుకు గానీ—"

"గోపాలం! నువు మరిక వచ్చినదారి పట్టు; చూస్తాగా, ప్రతి వాడూ యింతే—దేహీ అంటూ రావడమున్నూ, తాశిల్దారుడులాగా తల ఎగరెయ్యడమున్నూ"

గోపాలం సిగిరెట్టు తీశాడు. గోపాలం ఖరీదైన సిగిరెట్లే కాలుస్తాడు. మంచి సిగిరెట్లు కాల్చేవాళ్ళు అగ్గిపెట్టె లెప్పుడూ మరుస్తారు. బీడీ మారాజుల్ది ఆ జాగ్రత్త, నాకు తెలుసుగా.

"నిప్పెట్టె యిలా విసరవే—" అని లోపలికి కేక పెట్టాను.

"ఐ పోయిందండీ. ఇదుగో, పొయ్యి రాజెయ్యడమెలాగా అని చూస్తున్నా" అని ఆవిడా కేక వేసింది. ఏది కావాలన్నా; ఈ ఆడవాళ్ళు లేదు పొమ్మనడమే గద.

"మళ్ళీ దర్శనం చేస్తా" నంటూ సిగరెట్ మూతితో గోపాలం వెళ్ళి పోయాడు. సాయంత్రం క్లబ్బుగ్గామోసు పోతూ ఆ శెక్రటరీగారే వచ్చారు. వీళ్ళందరికీ యిదో శివమెత్తినట్లుంది. ఆ రాద్దైగాడి సన్మానం హడావిడే. పోనీ ఎల్లాగో నా దావా హైకోర్టు నుంచి గంగలో కలిసింది గదా నాకు చెయ్యరాదూ సన్మానం. మా అబ్బాయి సెకండు ఫారం రెండేళ్ళు తప్పాడుగదా, వాడికి చెయ్‌రాదూ సన్మానం. మా ఆవిడేమన్నా

తక్కువదా. లాంతరు గ్లాసులూ, అగ్గిపెట్టెలూ పగలగొడుతుందిగద దానికి చెయ్యరాదూ సన్మానం. రాధైకిట సన్మానం!"

"తమరే దయచేసిరా? రండి, ఇలా హిఁహిఁ ఇలా" అంటూ సెక్రటరీగారిని అహ్వానించాను. రాక రాక పెద్దలు యింటికొస్తే— మస మీదెందుకూ, లేతమాట!

"తమ దర్శనార్థం యిలా రాక తప్పిందికాదు" అన్నారాయన వస్తూనే.

"ఎంతమాట——ఎంతమాట"

ఆయన నవ్వి "చూడండి పిల్లకాయ్‌లు, రాధయ్యగారినీ, కిష్ట వేణమ్మగారినీ సన్మానించాలంటున్నారు!" అన్నాడు.

"చిత్తం చిత్తం"

"ఏదో మన నలుగురం తలో కాస్త వేసుకుంటే—"

"అదేనండీ, గోపాలం వచ్చాడు. చెప్పానే" సెక్రటరీగారు నవ్వారు.

"ఓ శేరు ఉప్పు దాఖల్ చేస్తున్నానండీ!"

"నా వంతు అది. ఆ అయిటం అయిపోయింది" అన్నారు సెక్రటరీగారు.

"అదేమిటండీ, గోపాలమూ చెప్పాడు" అన్నా.

"కాస్త మీరు, మరి, అట్టే—,"

"చూడండి సెక్రటరీగారూ. మరో విధంగా అనుకోవద్దు. పాపం, వాళ్ళు అనుకున్నవి కలిసిరాక నానిస్తూపడి ఇదౌతుంటే-పుండుమీద టించర్ రాసినట్టు తగుదునమ్మా అంటూ సన్మానమా?"

సెక్రటరీగారు నిర్ఘాంతపోయారు.

"అయినా శ్రెక్రటరీగారూ, ఎక్కడన్నా వుందటండీ యీ వింత. దర్జీవాడికి చొక్కాలకి గుడ్డయిస్తే వాడు లేదంటేనూ, కంసాలికి బంగారం యిచ్చి, వాడు పరారీ అయినప్పుడూ సన్మానమంటండీ?" అన్నాను.

"అసాధ్యుడవయ్యా!" అని పాపం ఆయనఏమీ చెయ్యలేక— సైటిల్ పారేశాడు. అమ్మో, అసలునాది పెంకెబుర్ర—ఆఁ!

"శ్రెక్రటరీగారూ, ఎవడన్నా యింట్లో పురుడొస్తుందని ఏర్పాట్లు చేసుకుంటున్నాడనుకోండ. ఇంతలో ఆవిడకు కడుపుపోతే వాళ్ళను సన్మానించటం ఏం న్యాయం?" ఆయన తెలివి తెల్లారిందో యేమో, తెల్ల మొహం వేశాడు.

"నేను నిక్కచ్చిగా అడుగుతున్నాననుకునేరు, ఏదో మాటవరస కంటున్నా" అని తేల్చేశాను.

"మొదటికి మోసంతెచ్చారే" అన్నాడు.

"మొహమాటం ఏముందీ యిందులో. అయినా విషయం వచ్చినప్పుడు అనుకోవడం తప్పు కాదుగా" అనేశాను.

ఆయన మీన మేషాలు లెక్కపెడుతున్నారు.

"నాకెందుకు సుమండీ—అబ్బే అబ్బే—"అని అభినయం చేశాను.

"మీకు వెయ్యిదణ్ణాలు. పోనీ, మీరు సభకైనా వస్తారా?"

"కాళ్ళెలా వస్తాయండీ.ఐనా ఒకణ్ణి పదిమంది పూలును చేస్తుంటే— నేనుగూడా రానా? ఇదేం ఏప్రిలు ఒకటికాదే—"

"మీకు పుణ్ణెం వుంటుంది. ఏదో మా తంటాలు మేం పడతాం. ఎదురు టమ టమా కొట్టకండి!" అంటూ లేవబోతున్నారు.

"కాస్త కూచోండి. మీరు ఆ రాధయ్యకు ఉప్పూ పత్రీ కాకుండా చేసేదీను. ఎవడన్నా ఉన్నమాటంటే టమటమా టండీ. ఎందుకూ వచ్చాయి ఏళ్ళు?"

సెక్రటరీగారికి ఏమనాలో తెలీక కొయ్యబారారు. 'రామ రామ' అన్నారు.

"మరి సన్మానమే వొద్దంటారా?" అన్నాడు.

"నా మాటలోని నిజం తెలుస్తోందిగదా. ఎవరికివారు కొంపకట్టు కెళ్ళండి. మరేం మురిగిపోదు మీ ఉప్పు...."

సెక్రటరీగారు లేచారు. గుమ్మందాకా సాగనంపి వొచ్చాను. "అయిదు రూపాయలెట్టి దుప్పట్లు కొనిస్తానూ? వీళ్ళ తిక్క యిలాగే వదల గొట్టాలి."

మళ్ళీ రెన్నాళ్ళు హడావిడి చెవిన పడలేదు. హాయిగా తిని తిరుగుతున్నాను. ఐనా, యుద్ధంవచ్చి, బతకడమెలాగురా అని ఇదవు తుంటే—ఎక్కణ్ణుంచి తెస్తాం చెప్పండి. ఇంకా నయం, రాధయ్య చక్కా వచ్చాడు. రాధయ్య రావడం నాకు మా చెడ్డ వీలు. వాళ్ళమీద కాస్త దులిపాను అంటే వీడు తొక్కే చిందులన్నీ కళ్ళారా చూడచ్చు.

రాధయ్య వస్తూనే అదో రకం మొహం పెట్టాడు, నువ్వే ఆదుకోవా లన్నట్లు.

"విన్నా విన్నా" అన్నా ఇదిగా.

"నీకాస్త పుణ్యం వుంటుందోయ్, నువ్వుకాస్త కలగజేసు కోవాలి."

"కలగజేసుకొంటానా, కారాలు మిరియాలు నూర్తానా?" అన్నాను రొమ్ములు కుంపటినే భరిస్తూన్నట్లు.

ఆముదం తాగిన మొహం పెట్టాడు. 'అది కాదు బాబూ,' అన్నాడు.

"మీకు తెలీదు బాబూ, వీళ్ళ చేష్టలు!" అంటే రాధయ్య వినిపించు కోడే.

"ఏదో బతికి చెడ్డవాణ్ణి-యీనాటికిలా అయింది గానీ-" అన్నాడు.

"ఎంత మాటన్నారూ? మీ అరికాలి గోరికి పోలుతారుటండీ-అన్నాను ఝుమాయిస్తూ. నా ధోరణే నాది.

"మీరల్లా ఇదవక- ఆయన చెప్పేది కాస్త చెవొగ్గండి!" అని కోప్పడ్డది మా ఆవిడ. ఇద్దరు మాట్లాడుకునేవి మూడోవారిగ్గాని నిజాన్ని చెప్పవు- నిజం.

"బాబూ, కానీండీ" అన్నాను.

"నీవల్ల ఆ సన్మానం ఆగిందని విన్నాను. ఇవి చేతులుకావు-"

"బాబూ. చేతులే- చేతులు పుచ్చుకుని చేతులు కావంటారేం?" రాధయ్య తెల్లబోయాడు.

"బాబూ, ఏదో తెలియకన్నాను, ఆ దుప్పట్ల ఖరీదు నేను ఇచ్చుకుంటాను చాటుగా!" అన్నాడు.

"వాళ్ళ యద్దేవా చేస్తున్నారండి" అన్నాను అక్కడికీ.

రాధయ్య జేబులోనుంచి అయిదు రూపాయల నోటు తీశాడు. ఆయనే అంత ప్రాధేయపడితే నేను, ఛ, ముష్టికతుకుతానా?

'ఎందుకు లెండి వుంచం' డన్నాను!

రాధయ్య నోటు జేబులోకి ఎక్కించాడు.

"అక్కడికీ మనసు పట్టలేక- యీ కుర్రకారును నమ్మవద్దు. ఆ గోపాలం మరీనూ" అని హితవు చెప్పి చూశాను.

"నాయనా, ఏదో కాస్త కరువు కాలంలో కలిసివస్తుంది. ఎల్లా చేస్తేనేం- మనం ఎంత ఏడుస్తూ పెడుతున్నా తద్దినాలు ముట్టటంలేదూ." అన్నాడు రాధయ్య. ఎంతమనిషి!

సన్మానం అప్పుడు నేనూ దుప్పట్లతో హాజరయ్యాను. గోపాలం నవ్వాడు. గోపాలం నవ్వినప్పుడల్లా నా గుండెల్లో దేవినట్లుంది. ●